సతీ సావిత్రి

భారతి

అనువాదం

వడ్డి భార్గవీఓంప్రకాష్

ప్రధాన సంపాదకుడు

ఎల్.ఎస్.శేషగిరిరావు

భారత భారతి పుస్తకమాల

3-4-852. కేశవనిలయం

బరకత్‌పుర, హైదరాబాద్-500027

ప్రచురణ కర్తలు

నవయుగభారతి ప్రచురణలు

పోస్ట్‌బాక్స్ నెం. 1041

నారాయణగూడా, హైదరాబాద్ - 500 029.

తెలుగు సంస్కరణ సంపాదకులు

టి. హరిహర శర్మ

ప్రథమ ముద్రణ : నవంబర్, 2002

వెల: రూ. 8.00

ప్రతులకు

సాహిత్యనికేతన్

3-4-852, బర్కత్‌పురా

హైదరాబాద్ - 500 027

ఫోన్ : 2756 3236

సాహిత్యనికేతన్

ఏలూరు రోడ్

విజయవాడ - 520 002

ఫోన్ : 2667421

ఇది మా మాట

కేవలం భారతదేశంలోనే కాక, మొత్తం ప్రపంచంలోనే ప్రఖ్యాతులైన మన పూర్వీకులను స్మరించడం, వారి జీవితాలను అధ్యయనం చేయడం ఎల్లప్పుడూ ప్రేరణదాయకంగాను, మార్గదర్శకంగాను ఉండగలదనడంలో సందేహం లేదు.

మన చరిత్రకే వన్నెతెచ్చిన ఆ మహనీయుల జీవితాలను సరళమైన, ఉత్తేజకరమైన భాషలో ప్రజలకందించే చక్కని ప్రయత్నాన్ని రాష్ట్రోత్థాన పరిషత్, బెంగుళూరువారు ప్రారంభించారు.

"నవయుగభారతి" ఆ పుస్తకాలను తెలుగులోకి అనువదించే బృహత్కార్యాన్ని చేపట్టింది. భారత భారతి పుస్తకమాల రూపంలో మీ చేతుల్లో ఉన్న పుస్తకాలు ఆ ప్రయత్న ఫలితమే. మన చరిత్రలోని మహాపురుషుల జీవితాలు ఈ పుస్తక మాల ద్వారా మీకందించబడతాయి.

అమరమైన, అనంతమైన మన గత చరిత్ర అనే అమృత స్రోతస్సును తరువాతి తరానికి అందించగలుగుతున్నామనే సంతృప్తితో ఈ పుస్తకాలను మీముందు పెడుతున్నాం. మీరు కూడా ఈ కృషిని ప్రశంసించగలరని, ప్రోత్సహించగలరని ఆశిస్తాను.

మూలరచనను సరళమైన, ఆహ్లాదకరమైన రీతిలో తెలుగులోకి అనువదించిన అనువాదకులకు ధన్యవాదములు.

– హరిహరశర్మ
సంపాదకులు

సతీ సావిత్రి

మద్రదేశపు రాజు అశ్వపతి కూతురు సావిత్రి. సాల్వదేశపు రాజు ద్యుమసేనుని పుత్రుడగు సత్యవంతుని వివాహం చేసుకొన్నది. సత్యవంతుని ఆయువు వివాహంనాటికొక సంవత్సరమే మిగిలి ఉంది. భర్త ఆయుష్షు ఇక నాల్గుదినాలున్నదనగా సావిత్రి త్రిరాత్ర వ్రతాన్ని ప్రారంభించింది. నాల్గవరోజు తపోవనంలో హఠాత్తుగా సత్యవంతుడు మరణించాడు. సత్యవంతుని ప్రాణాన్ని యముడు బంధించి తీసుకొనిపోతుండగా సావిత్రి వెంబడించింది. యమ సావిత్రీ సంవాదంతో యముడు ప్రసన్నుడై సావిత్రికి వరాలిచ్చాడు. అందులో ఆమె పుత్రప్రాప్తిని యాచించింది. యముడు తథాస్తు అన్నాడు. అందువలన యముడు సత్యవంతుణ్ణి బ్రతికించవలసి వచ్చింది. జ్యేష్ఠ పూర్ణిమ రోజున భారతదేశంలో అన్నిచోట్లా పెండ్లి అయిన స్త్రీలు మహాభక్తితో మహాసాధ్వి సావిత్రీ వ్రతాన్ని చేస్తారు.

చాలారోజుల క్రిందటి మాట. అశ్వపతి మద్ర దేశానికి రాజుగా వుండేవాడు. అతడు న్యాయపాలకుడు 'సద్గుణ సంప'న్నుడు. అతని భార్య పేరు మాలవి. ఆ దంపతులు అన్ని రకాలుగా ఆనందంగా వున్నా పిల్లలు లేనిలోటు మాత్రం తప్ప లేదు. సంతానం కోసం ఎన్నో యజ్ఞయాగాలు చేశారు. అలానే సావిత్రిదేవి అర్చనా చేశారు. అలా పద్దెనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ కాలమంతా ధార్మిక కార్యక్రమాన్ని ఆచరిస్తూనే వున్నారు.

చివరకు సావిత్రిదేవి ప్రసన్నమైంది. ఆ దంపతులు సావిత్రిదేవిని అనేక రకాలుగా ఆరాధించారు. "అమ్మా! నా

దగ్గర అన్నీ వున్నాయి. నేను నా భార్యతో సంతోషంగా వున్నాను. నా ప్రజలు నన్ను అభిమానంతో చూస్తున్నారు. మా మంత్రులు, సామంతులు కూడా నన్ను ఎంతో గౌరవంతో సేవిస్తున్నారు. అయితే నాకు సంతానం లేదు. నా తర్వాత ఈ దేశాన్ని రక్షించేందుకు ఎవరూ లేరు. తల్లీ...నా రాజ వంశం కొనసాగడానికి దయచేసి నాకో పుత్రుడ్ని ప్రసాదించు" అని అశ్వపతి ఆ దేవతను వేడుకున్నాడు.

"ఓ రాజా! బ్రహ్మ అనుగ్రహం లేనిదే ఏదీ జరగదు. ఆయన అనుగ్రహం కారణంగానే నీకు కాలచక్రాన్ని మార్చే ఓ బాలిక జన్మిస్తుంది" అని సావిత్రిదేవి వరాన్ని ప్రసాదించి మాయమైంది.

కొంతకాలం గడిచాక అశ్వపతి భార్య ఓ ఆడపిల్లకు జన్మనిచ్చింది. సావిత్రిదేవి వరప్రసాదం కాబట్టి పాపకు అమ్మవారి పేరునే ఆ దంపతులు పెట్టారు.

వరుడికై అన్వేషణ

సావిత్రి సాటిలేని సద్గుణాలతో, వయసుకు తగ్గ సిగ్గు బిడియాలతో పెద్దదయ్యింది. అచ్చు అమ్మవారిలానే సావిత్రి

కూడా అందంగా, కాంతివంతంగా వుండేది. ఇక ఆమె వివాహం జరపడమే ఆలస్యం. ఆమె చేతిని అందుకోవడానికి వీరులు, శూరులు, వినయసంపన్నులు అయిన అందమైన యువకులు ఎందరో వచ్చారు. కానీ వచ్చిన రాజకుమారులు సావిత్రిని చూడగానే - ఆమెకు తాము తగమని గ్రహించి నిరాశతో వెనుదిరిగి వెళ్ళిపోయారు.

18 సంవత్సరాలపాటు వ్రతాలు ఆచరించాక జన్మించిన సావిత్రి అంటే అశ్వపతికి చాలా ఇష్టం. ఆమె ఆలోచనా విధానం, వ్యవహారశైలి అశ్వపతికి ఎంతో నచ్చేవి. ఆయన జీవితానికి సావిత్రి కేంద్ర బిందువు అయ్యింది. ఆమె తన స్నేహ గంథంతో తండ్రి మనసును నింపేసింది. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఏ యోగ్యుడూ తన కూతురును వివాహమాడటానికి ధైర్యం చేయకపోవటం రాజుకు బాధ కలిగించింది.

ఓ రోజు అశ్వపతి తన కూతుర్ని దగ్గరకు పిలిచి "తల్లీ...నీకు వివాహం చేసుకునే వయసు వచ్చింది. నీ మనసుకు నచ్చిన చోటుకు వెళ్ళి - నీకు తగిన వరుణ్ణి ఎంపిక చేసుకో" అని చెప్పి ఆమె ప్రయాణానికి పూర్తి ఏర్పాట్లు చేశాడు.

సత్యవంతుడు

సావిత్రితో పాటు ఆమె సేవకులు, పరిచారికలు బయలు దేరారు. అశ్వపతి ఓ వృద్ధమంత్రిని కూడా వాళ్ళతో పంపాడు. వాళ్ళు ఎన్నో రాజ్యాలను సందర్శించారు. పండితుల్ని, విద్వాంసుల్ని దర్శించుకున్నారు, ఆశీర్వాదాల్ని పొందారు. దారి పొడుగునా సావిత్రి ఎందరికో దానాలు చేసింది. పవిత్ర స్థలాల్లో చేతులెత్తి మొక్కింది. కానీ ఆమె మనసుకు నచ్చిన యువకుడు కన్పించలేదు.

ఇక యాత్రను ముగించి ఇంటికి తిరిగి వెళ్ళడానికి సావిత్రి సిద్ధపడింది. దారిలో ఓ అడవి మార్గం గుండా ప్రయాణం చేయాల్సి వచ్చింది. అక్కడ వృద్ధ దంపతులు ఓ చెట్టు కింద కూర్చుని వుండటాన్ని ఆమె చూసింది. వారికి కాస్త దూరంలో ఓ యువకుడు కనిపించాడు. అతను పళ్ళను కోసి ఆ వృద్ధ దంపతులకు అందిస్తున్నాడు. సావిత్రి అతన్ని జాగ్రత్తగా గమనించింది. యువకుడి ముఖం ఎంతో సౌమ్యంగా వుంది. ఓ రకమైన ఆకర్షణ వుంది. ఆమె అతన్ని

రెప్పవాల్చకుండా చూడసాగింది. ఆకర్షణీయమైన ఆ యువ కుడు ఆమె మనసులో స్థిర స్థానం సంపాదించేశాడు.

సావిత్రిలో ఆసక్తి పెరిగింది. తన వృద్ధమంత్రిని పిలిచి "శ్రీమాన్! ఆ చెట్టు నీడలో కూర్చున్న వృద్ధ దంపతుల్ని, ఆ యువకుడిని గమనించారా! దయచేసి వారి వివరాల్ని తెలుసుకోండి" అని అంది.

వృద్ధమంత్రి ఆ యువకుడి దగ్గరకు వెళ్ళి "నాయనా... మీరెవరు? ఈ వృద్ధులు ఎవరు? మీరీ అడవికి ఎందుకు వచ్చారు?" అని ప్రశ్నించాడు.

దానికి ఆ యువకుడు సమాధానం చెబుతూ " నా పేరు సత్యవంతుడు. వీళ్ళు నా తల్లిదండ్రులు. నా తండ్రి ఒకప్పుడు సాల్వ దేశానికి రాజు. ఆయన పేరు ద్యుమత్సే నుడు. చూపు పోగొట్టుకున్నారు. అదే అదునుగా భావించి శత్రువులు మా రాజ్యంపై ఆక్రమణ చేశారు. మా నాన్నగారు పోరాటంలో ఓడిపోయారు. అందువల్లే మేం ఈ అడవికి వచ్చాం" అని అన్నాడు.

మంత్రి సావిత్రి దగ్గరకు వెళ్ళి యువకుడి గురించి

తెలిసికొన్న విషయాలు చెప్పాడు. ఆ యువకుడి గొప్పతనం, తేజస్సు సావిత్రిని మొదటి చూపులోనే ప్రభావితం చేశాయి. ఇప్పుడు మంత్రి చెప్పిన విషయాలు విన్న తర్వాత ఆమెకు అతనో ఆదర్శమైన, మంచి యువకుడని స్పష్టమైంది. అంతే కాదు ఆ యువకుడిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంది.

ఆమె అనుకున్న పని పూర్తయ్యింది. తన మనసుకు నచ్చిన యువకుడ్ని ఎంపిక చేసుకుంది. దాంతో ఆమె మద్ర దేశానికి వెను తిరిగింది.

అనుకూలించని అదృష్టం

సావిత్రి రాజమందిరానికి తిరిగి వచ్చేసరికి నారద మహర్షి అక్కడకు వచ్చి వున్నారు. నారదుడు గొప్ప విద్వాంసుడు. ఆయనకు భూత భవిష్యత్ కాలాల గురించి తెలుసు. భూమి, ఆకాశము, పాతాళము – మూడు లోకాలను సంచరిస్తారు కాబట్టి ఆయనకు తెలియని విషయం లేదు.

నారదుడిని అశ్వపతి సాదరంగా ఆహ్వానించారు. ఆయన పాదాలను కడిగి పూజ చేశారు. అదే సమయంలో

సావిత్రి రాజమందిరంలోకి ప్రవేశించింది. ఆమె నారదుడికి, అశ్వపతికి నమస్కరించింది.

నారదుడు ఆమెను ఆశీర్వదించి ఆ తర్వాత అశ్వపతి వైపు తిరిగి "మహారాజా మీ అమ్మాయి ఎక్కడకు వెళ్ళింది? నిజంగా ఇటువంటి కుమార్తె కలగడం మీ అదృష్టం. ఆమె వివాహం గురించి మీరేమైనా ఆలోచన చేశారా?" అని అడిగాడు.

అశ్వపతి జరిగిన విషయాన్ని నారదుడికి వివరిస్తూ "స్వామీ! ఆమెకు నచ్చిన వరుడిని ఎంపిక చేసుకోమని పంపాను" అని అన్నాడు. సావిత్రివైపు చూసి "అమ్మా! నీ మనసుకు నచ్చిన యువకుడు దొరికాడా?" అని అడిగాడు.

సావిత్రి సమాధానం చెబుతూ "నాన్నా....నేను అన్ని దేశాలను తిరిగాను. కానీ నా మనసుకు నచ్చిన యువకు డెవరూ కన్పించలేదు. చివరగా మేమొక అడవికి వెళ్ళాం. అక్కడ నాకు సత్యవంతుడనే యువకుడు కనిపించాడు. అతని తండ్రి పేరు ధ్యుమత్సేనుడు. ఆయన సాల్వదేశపు రాజు. అయితే ఇప్పుడు ఆయన తన చూపును, రాజ్యాన్ని పోగొట్టు

కుని అడవిలో వుంటున్నాడు. నేను నా మనసుని సత్య వంతుడికి ఇచ్చాను" అని అంది.

నారదుడికి అద్భుతమైన భవిష్య దృష్టి వుంది. అశ్వపతి నారదుడివైపు చూసి ఆయన సమాధానం కోసం వేచి వున్నాడు. తన కుమార్తె ఎంపిక విషయంలో నారదుడి ఆలో చన ఏమిటో తెలుసుకోవాలని అశ్వపతికి వుంది.

నారదుడు కొన్ని క్షణాలు కళ్ళుమూసుకున్నాడు. ఆతర్వాత "రాజా! నీ కుమార్తె ఎంపిక సరి అయినదే. ఆ యువకుడు ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుతాడు. అందువల్లనే అతనికి సత్యవంతుడనే పేరు వచ్చింది. చిన్నతనం నుండే అతనిలో ప్రేమభావన వుండేది. అందువల్ల అతనికి చిత్రాశ్వ అనే మరో పేరు కూడా వుంది. అతనికి సూర్యుడితో సమా నమైన కాంతి, బుద్ధి, ఆకర్షణ, భూదేవిని మించిన ధీరత్వం, గంభీరం, శాంతం, స్నేహం, వ్యవహార శీలత వున్నాయి. అందువల్ల అతను అజాత శత్రువు" అని చెప్పాడు.

"నారదా...మీ మాటలు వింటుంటే నాకెంతో ఆనం

దంగా వుంది. మీరు పండితులు. మీరింతవరకూ సత్యవంతుడి విషయంలో అనుకూలమైన సంగతులే చెప్పారు. ఈ జంటకు అనుకూలంగా లేని విషయాలేమైనా వుంటే దయచేసి తెలియచేయండి" అని అశ్వపతి కోరాడు.

నారదుడికి బాధ కలిగింది.

నారదుని విషాద వదనాన్ని చూసి అశ్వపతి ఖంగారు పడ్డాడు. "మహర్షీ! నేనేమైనా తప్పుగా మాట్లాడి వుంటే క్షమించండి. నావల్ల ఏదైనా పొరపాటు జరిగి వుంటే దయచేసి అదేమిటో శలవీయండి" అని వేడుకున్నాడు.

దానికి నారదుడు "అశ్వపతీ! సత్యవంతుడిలో ఏలోటు లేదు. అతను సద్గుణ సంపన్నుడు. కానీ అదృష్టం అతనికి అనుకూలంగా లేదు. అతని జీవితకాలం తక్కువ. ఇవాల్టి నుండి ఒక సంవత్సరానికి అతని జీవితం ముగుస్తుంది. ఈ విషయం తెలియక సావిత్రి తన మనసును సత్యవంతుడికి ఇచ్చింది" అని అన్నాడు.

తన కుమార్తె కోరిక నెరవేర్చలేకపోతున్నానని ఓవైపు,



“నాన్నగారు! నత్యవంతుడి జీవితకాలం ఎక్కువ అయినా- తక్కువ అయినా- అతను తప్ప వేరెవరూ నా భర్త కాలేరు”

నారదుడి మాటల్ని విని మరోవైపు అశ్వపతి బాధతో కృంగి పోయాడు.

ఈ స్థితిలో ఏం చేయాలో అశ్వపతకి పాలుపోలేదు.

వేరేవరూ లేరు

అశ్వపతి తన కుమార్తెతో "అమ్మా...నీ ఎంపిక చాలా మంచిది. నువ్వు ఇష్టపడిన సత్యవంతుడు అందగాడు, బుద్ధి మంతుడు కూడా. కానీ అతనికి ఆయుష్షు చాలా తక్కువ. అది తెలిసి కూడా నేను నీ వివాహాన్ని అతనితో ఎలా చేయ గలను? నీకిష్టమైన వేరెవరైనా వుంటే చెప్పు. నీ ఇష్టాను సారం అతనితో పెళ్లి జరిపిస్తాను" అని అన్నాడు.

సావిత్రి నారదుడివైపు, తండ్రివైపు ఓసారి చూసింది.

నారదుడు కూడా సావిత్రివైపు దృష్టిసారించి - ఆమె సమాధానం కోసం ఎదురు చూడసాగాడు. అశ్వపతి పుట్టెడు దుఃఖంతో విచారవదనుడై వున్నాడు.

"నాన్నగారూ...సత్యవంతుడి జీవితకాలం ఎక్కువ అయినా - తక్కువ అయినా అతని విషయంలో నేనో నిర్ణయా నికి వచ్చాను. అతను తప్ప వేరెవరూ నా భర్త కాలేరు" అని సావిత్రి స్పష్టం చేసింది.

దానికి అశ్వపతి "సావిత్రి! నువ్వు ఇంకా చిన్న పిల్లవు. తొందరపడి నా మాట కాదనకు, కొంతసేపు ఆలోచించు. ఒక సంవత్సరం తర్వాత నువ్వు ఎంత భయంకరమైన దుఃఖాన్ని ఎదుర్కోవలసి వస్తుందో అర్థం చేసుకో" అని అనునయించాడు.

"నాన్నగారు! నేను మీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నానని అనుకోవద్దు. ఆయుష్షు ఎంత వున్నా సత్యవంతుడు నా భర్త కావాల్సిందే. ఈ నిర్ణయం మార్చుకోవటంలో నేను అసమర్థురాలిని" అని సావిత్రి అంది.

దాంతో అశ్వపతి నారదుడివైపు తిరిగి "మహర్షీ! దయచేసి మా అమ్మాయికి మీరైనా మంచి సలహా ఇవ్వండి. ఆమె మనసు సత్యవంతుడి పట్ల విముఖతను ప్రదర్శించేలా చేయండి" అని అన్నాడు.

"అశ్వపతీ! మీ అమ్మాయి ఓ నిర్ణయానికి వచ్చేసింది. నిజానికి సత్యవంతుడిని మించిన గుణవంతుడు వేరెవరూ లేరు. అన్ని విధాల అతను మీ అమ్మాయికి తగినవాడు. ఈ వివాహం జరగనివ్వండి. అంతా మంచే జరుగుతుంది" అని అన్నాడు నారదుడు.

అశ్వపతి కూడా తన కూతురు ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయదలచుకోలేదు. దానికి తోడు నారదుడి ఆశీస్సులు కాస్త ధైర్యాన్ని కలిగించాయి..

భార్యాభర్తలు

ఓ మంచి రోజున అశ్వపతి తన దర్బారులోని కొందరు ప్రముఖుల్ని తీసుకొని ధ్యుమత్సేనుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ధ్యుమత్సేనుడిని కలిసి - ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకున్నాడు. ఆ తర్వాత సావిత్రిని పిలిచి "ఈమె నా కుమార్తె సావిత్రి. దయచేసి ఈమెను మీ కోడలుగా స్వీకరించాల్సిందిగా నా ప్రార్థన" అని అన్నాడు.

దానికి ధ్యుమత్సేనుడు "మహారాజా! మేం రాజ్యాన్ని కోల్పోయి అడవిలో వుంటున్నాం. సావిత్రి కష్టాలతో, ఈ అడవిలో వుండటం సాధ్యమేనా? ఆమె ఇక్కడ వుండగలదా? ఇక్కడ లభించే కందమూలాల్ని తింటూ జీవితాన్ని గడపగలదా?" అని అశ్వపతిని అడిగాడు.

"మహాశయా! దయచేసి నా ప్రార్థనను మీరు శ్రద్ధతో ఆలకించి నా కుమార్తెను మీ కోడలుగా చేసుకోండి. మీ

సంరక్షణలో, ప్రేమలో ఆమె కష్టాలన్నింటినీ మర్చిపోతుంది. మీ ఆప్యాయానురాగాల నడుమ ఆమె తప్పక సుఖపడగలదనే నమ్మకం నాకుంది" అని అశ్వపతి బదులిచ్చాడు.

"మీరు రాకముందు నుండే వీరిద్దరూ జంట కావాలని నేను కోరుకుంటున్నాను. కానీ రాజ్యాన్ని పోగొట్టుకుని, అడవిలో వుంటున్న నేను ఈ వివాహం గురించి ఎలా మాట్లాడగలను?...అనే సందేహం వుంది" అని ద్యుమత్సేనుడు అన్నాడు.

సత్యవంతుడు, సావిత్రిల వివాహం జరిగింది. వారిరువురూ భార్యాభర్తలయ్యారు. తన మనసుకు నచ్చిన వ్యక్తినే వివాహం చేసుకున్నందుకు సావిత్రి ఎంతో సంతోషించింది. అందమైన, ఆదర్శవంతమైన మంచి భార్య లభించినందుకు సత్యవంతుడు కూడా ఆనందించాడు.

పద్దెనిమిదేళ్ళు సావిత్రీదేవిని ఆరాధించిన తర్వాత జన్మించిన తన కూతురును అత్తవారింట వదిలి వెళ్ళటానికి అశ్వపతికి చాలా కష్టం అనిపించింది. ఎంతో దుఃఖంతో ఆయన తన రాజ్యానికి తిరుగు ప్రయాణమయ్యాడు.

సుఖంలో దుఃఖం

అంతవరకూ సావిత్రి ధరించిన మెరిసిపోయే మేలిమి బంగారపు ఆభరణాలను త్యజించింది. చెట్టు బెరడులతో చేసిన వస్త్రాల్ని ధరించింది. అత్తమామలకు చక్కగా సేవలు చేయసాగింది. ఎల్లప్పుడూ ఆనందంగా, ఉల్లాసంగా వుంటూ అందరి హృదయాలనూ జయించింది. ఆమె సత్యవంతుడికి అనుకూలవతి అయిన భార్యగా మారింది.

కానీ, నారదుడు చెప్పిన విషయాన్ని మాత్రం ఆమె ఒక్క క్షణం కూడా మరవలేకపోయింది. ఆ మాటలు రగులుతున్న కొలిమిలా ఆమె హృదయాన్ని దహిస్తూనే ఉన్నాయి. ఆఖరికి కలలో కూడా ఆమె సత్యవంతుడి అల్పాయుష్షను మర్చిపోలేకపోతోంది. నారదుడి వచనాలు ఆమె మనసులో మెదులుతుండేవి.

ఒక రోజు గడిచింది...రెండు రోజులు గడిచాయి... ఆమె గడుస్తున్న రోజుల్ని లెక్కిస్తూనే వుంది.

అలా పది నెలల కాలం గడిచింది. రోజులు వెనక్కి

వెళుతున్న కొద్దీ ఆమె ఆలోచనలు పెరుగుతూ వస్తున్నాయి. ఆమె హృదయం దుఃఖంతో నిండిపోయినా - ఆ ప్రభావం చేసే పనుల మీద ఎప్పుడూ పడనీయలేదు. తన మనసులోని బాధను ఎవరూ గుర్తించకుండా సావిత్రి జాగ్రత్తపడింది.

నాలుగు రోజులే మిగిలింది

కాలచక్రం తిరుగుతూనే వుంది. ఒక నెల...రెండు నెలలు. ఇలా పదకొండు నెలలు గడిచాయి. కేవలం ఒక నెలే మిగిలింది. ఇప్పుడు అది రోజుల్లోకి వచ్చేసింది. సత్యవం తుడి జీవితకాలంరోజులు గడిచిపోతున్నాయి. ఇక నాలుగు రోజులే వుంది. సావిత్రి మూడు రోజుల పాటు నియమ నిష్ఠలతో ధార్మిక కార్యక్రమాలను ఆచరించింది. ఈ మూడు రోజులూ ఉపవాసముంది. చివరకు ఒక్క నీటి బొట్టును కూడా స్వీకరించకూడదనుకుంది. రాత్రి పగలు తన ఇష్ట దైవమైన సావిత్రీదేవినే ఆరాధిస్తూ వుంది. తన తండ్రికి ఆశీస్సులు అందించిన ఆ దేవిని - తన భర్తను రక్షించా ల్సిందిగా సావిత్రి ప్రార్థించింది.

ఈ మూడు రోజులూ సావిత్రి ఎవరితోనూ మాట్లా

డనూ లేదు. "అమ్మా...సావిత్రి...మూడు రోజులుగా ఇంత నియమ నిష్ఠలతో పూజలు ఎందుకు చేస్తున్నావ్? ఇలా ఉప వాసం ఉండడం ఎంత కష్టమో తెలుసా?" అని ధ్యుమ త్సేనుడు సావిత్రిని వారించాడు.

"మామగారు! ఏ ఆటంకం లేకుండా నేనీ పూజా కార్య క్రమాన్ని పూర్తి చేయగలిగేలా ఆశీస్సులు ఇవ్వండి. దయచేసి ఉపవాసదీక్షను విరమించమని మాత్రం కోరకండి" అని సావిత్రి విన్నవించుకొంది.

వర్ణనాతీతమైన రోజు

ఆఖరి మూడు రోజులు కూడా గడిచిపోయాయి. ఆమూడు రోజులు సావిత్రి దృష్టిలో మూడు క్షణాలుగా వున్నాయి. ఏ రోజు గురించి ఆమె అనుక్షణం భయపడిందో – ఏ రోజును తలుచుకుంటే ఆమె మనసు చిగురుటాకులా వణికిపోయేదో – ఆ రోజు రానే వచ్చింది. రాత్రంతా నిద్ర పట్టక అటు ఇటు దొర్లుతూనే వుంది. ఆమె మనసంతా మండుతున్న అగ్ని గోళంలా వుంది.

తెల్లవారింది!

ఆమె మనసులోని వేదనను వర్ణించడానికి మాటలే దొరకవు. అంత వేదనలోనూ సావిత్రి తన దినచర్యల్ని విస్మరించలేదు. తన కులదేవతను పూజించింది. అత్త మామలకు సేవ చేసింది. వారికి భోజన ఏర్పాట్లు చేసింది. ఆ తర్వాత దంపతుల పాదాలకి మ్రొక్కింది. "భర్తతో పాటు కలకాలం జీవించు" అని వారు ఆశీర్వదించారు. ఆ మాటలు సావిత్రిని ఊరడింప చేశాయి. వాళ్ళెప్పుడూ సత్యాన్నే పలుకుతుంటారు కాబట్టి వారి మాటలు వృధా కావు అని సావిత్రి భావించింది. అత్త మామల ఆశీస్సులు నిజం కావాలని దేవుడిని ప్రార్థించింది.

సత్యవంతుడికి మృత్యువు దగ్గర పడింది. ఇక కొద్ది నిముషాలే మిగిలి వుంది.

నేనూ మీ వెంటే వస్తాను

ఎప్పటిలాగానే సత్యవంతుడు కట్టెలు తీసుకురావడానికి అడవికి బైలుదేరాడు. ఆ రోజు సావిత్రి సత్యవంతుడి ఎడబాటును తట్టుకోలేకపోయింది. కానీ సత్యవంతుడిని ఆపి

– అతని పనికి ఆటంకం కలిగించటమూ ఇష్టంలేకపోయింది. ఆమె మాట విని అతను అడవికి వెళ్ళకపోయినా 'ఎందుకు ఆపా'వని ప్రశ్నిస్తే తాను ఏం సమాధానం ఇవ్వగలదు! 'మృత్యువు మిమ్మల్ని సమీపిస్తోంద'ని చెప్పగలదా! అదే విధంగా ఈ సమయంలో ఒంటరిగా సత్యవంతుడినీ పంప లేని పరిస్థితి. ఇవన్నీ ఆలోచించుకుని 'ఏదైతే అది అవుతుం దని' సత్యవంతుడిని అడవికి పంపడానికే సిద్ధపడింది.

ఆ వెంటనే సత్యవంతుడిని సమీపించి "స్వామీ ఇవాళ నేను మీతో పాటు అడవికి వస్తాను. ఆ వన సౌందర్యాన్ని చూడాలని నాకూ వుంది. అదే విధంగా మీ పనిలో భాగాన్ని పంచుకుంటాను. మీతో నేనూ వస్తాను. దయ చేసి నా మాట కాదనకండి"అని అంది సావిత్రి.

సత్యవంతుడు ఆశ్చర్యపోయాడు. "ప్రియా! నువ్వు నాతో వస్తానంటే సంతోషమే. కానీ మూడు రోజులుగా కఠిన ఉపవాసం చేసి నువ్వెంతో బలహీనంగా వున్నావు. అలసి పోయావు. ఇంతవరకూ ఆహారమే తీసుకోలేదు. ఈ స్థితిలో అడ విలో నడవటం అంత సులభం కాదు. నువ్వు నీ పూజా



సావిత్రీ! నేను యమధర్మరాజును. నీ భర్తప్రాణాలు



... నీ భర్తప్రాణాలు తీసుకొనిపోవటానికి వచ్చాను!

కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఎప్పుడయినా నాతో రావచ్చు" అని అన్నాడు.

"నాకేవిధమైన ఇబ్బంది లేదు. అడవిలో వికసించే పుష్పాలను చూడాలని, పక్షుల కిలకిలారావాలు వినాలనీ వుంది. ఇవాళే నేను మీతో వస్తాను" అని అంది సావిత్రి.

"సావిత్రి! నిన్ను బాధ పెట్టడం నాకిష్టం లేదు. నీకు ఆనందం కలుగుతుందంటే ఆటంకపరచను. నువ్వు నాతో వస్తానంటే నాకూ సంతోషమే. ఒకసారి అత్త మామల అను మతి తీసుకుని రా...వెళ్ళు" అని సత్యవంతుడు అన్నాడు.

సావిత్రి అత్తమామల నుండి అనుమతి పొంది భర్తతో పాటు అడవికి బైలుదేరింది. ఆమె పైకి సంతోషంగా మాట్లా డుతూ వున్నా మనసు మాత్రం వేదనతో నిండిపోయి వుంది. సత్యవంతుడు తనతో సావిత్రి వున్నందుకు ఎంతో ఆనందంగా వున్నాడు. ఇంతకు ముందెన్నడూ అడవిని చూడనట్టుగానే ఉల్లాసంగా వీక్షించసాగాడు. సావిత్రి మనసులో అగ్నిశిఖలు చెలరేగుతున్నా - భర్త చెప్పే మధురమైన మాటల్ని వింటూనే అతన్ని సంతోషపరిచే ప్రయత్నం చేస్తోంది.

ఇద్దరూ కలిసి భగవంతుడికి పూజ చేయడానికి కావల సిన పూలను, పళ్ళను సేకరించారు. సావిత్రిని ఓ చెట్టు కింద కూర్చోమని చెప్పి సత్యవంతుడు కట్టెలు కొట్టడం ప్రారంభిం చాడు. కనురెప్ప వాల్చకుండా సావిత్రి సత్యవంతుడిని గమని స్తూనే వుంది. నారదుడు భవిష్యవాణి గురించి చెప్పిన భయా నక క్షణాలు దగ్గర పడ్డాయని సావిత్రి అనుకుంది. ఆమె శరీరం కంపించటం మొదలు పెట్టింది. సహించలేనంత బాధ మనసును ఆవరించింది.

నేను యముణ్ణి

ఉన్నట్టుండి సత్యవంతుడి శరీరమంతా చమటతో తడిసిపోయింది. తల వెయ్యి ముక్కలు అయిపోతుందా అన్నంత బాధ కలిగింది. దాంతో 'సావిత్రీ' అంటూ సత్యవం తుడు గట్టిగా పిలిచాడు.

సావిత్రి వెంటనే లేచి అతనివైపు పరిగెత్తింది.

"నా తలంతా భరించలేనంత నొప్పిగా వుంది. నా శరీరమంతా చెమటతో తడిసిపోయింది. ఈ బాధను తట్టు కునే శక్తి నా శరీరానికి లేనట్టుగా వుంది" అని సత్యవంతుడు తల్లడిల్లుతూ అన్నాడు.

"స్వామీ! మీరు కట్టెలు కొట్టిన కారణంగా అలసిపోయి వున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటే మీ తలనొప్పి తగ్గిపో తుంది. కాసేపు మీరు పడుకోండి" అని అంది సావిత్రి.

నేల మీద పడుకున్న భర్త తలను తన ఒడిలో పెట్టుకుందామె.

మరుక్షణమే సత్యవంతుడి పాదాల చెంత నల్లగా నిగనిగలాడే శక్తివంతమైన ఆకారం ప్రత్యక్షమైంది. అతను మృత్యు దేవుడు యమధర్మరాజు.

సావిత్రి భర్త తలను ఒడి నుండి తీసి నేల మీద వుంచి లేచి నిలబడింది. ఆ తర్వాత ఆ స్వామికి శిరస్సు వంచి నమస్కరించింది.

"ప్రభూ! మీరెవరు? ఇక్కడకు ఎందుకొచ్చారు?" అని ప్రశ్నించింది.

సామాన్య వ్యక్తులకు యమధర్మరాజును చూడటం సం భవం కాదు. కానీ సావిత్రికున్న పతి భక్తి వల్ల, ఆమె చేసిన పూజాకార్యాల వల్లా యమధర్మరాజును చూడగలిగింది.

యమధర్మరాజు సావిత్రికి ఉన్న విషయం చెప్పాడు.

"తల్లీ! ఇవాళ నీ భర్త జీవితంలో ఆఖరి రోజు. అతని ప్రాణాలు తీసుకెళ్ళడానికే నేను వచ్చాను. నేను యముడిని. నీలో వున్న ఆధ్యాత్మిక శక్తి కారణంగా నీకు నేను కనిపిస్తున్నాను. నీ ప్రశ్నకు సమాధానమూ ఇస్తున్నాను" అని యమధర్మరాజు బదులిచ్చాడు.

అలా చెప్పి ఆయన సత్యవంతుడి ప్రాణాలను బంధించాడు. అదే క్షణం సత్యవంతుడి ప్రాణాలు అతని శరీరాన్ని వదిలి పెట్టాయి. యముడు దక్షిణ దిశగా కదిలాడు. అలా కొద్ది దూరం వెళ్ళి మళ్ళీ వెనుదిరిగి ఓసారి చూశాడు.

నేను ధర్మాన్ని వదిలిపెట్టను

సావిత్రి యమధర్మరాజు వెనకే నడిచి వస్తోంది. యముడికి ఆశ్చర్యం కలిగింది. ఆయన, ఆయన సేవకులు ఇప్పటివరకూ లక్షలాదిమంది ప్రాణాల్ని తీసుకుని వెళ్ళారు. కానీ ఇప్పటివరకూ ఎవరూ ఇలా మృతుడి వెనుక రాలేదు. సావిత్రి సాహసానికి యముడు అబ్బురపడ్డాడు.

అయితే మనసులోని భావాన్ని వ్యక్తం చేయకుండా

ఆయన కాసేపు ఆగాడు. "సావిత్రి! నువ్వు నీ భర్తతో ఎంత వరకు అవకాశం వుందో అంతవరకూ తోడు వున్నావు. అతను జీవించి ఉన్నంత కాలం నీడలా వెంట వున్నావు. ఇక వెనక్కి వెళ్ళిపో. నీకు - అతనికి మధ్య సంబంధం ముగిసిపోయింది. వెళ్ళి - అతని శరీరానికి అంతిమ సంస్కారాలు చేయి" అని యముడు అన్నాడు.

దానికి సావిత్రి "మనం ఎవరితోనైనా కలిసి ఏడు అడుగులు వేస్తే వారు స్నేహితులౌతారని చెబుతుంటారు. నేను మీతో ఇంత దూరం నడిచాను. అందువల్ల మీరూ నాకు స్నేహితులే. ఆ కారణంగా నేను మీకో మాట చెప్పాలనుకుంటున్నాను. జ్ఞానము, ధర్మము కోసం మనుషులు అడవిలో తపస్సు చేస్తారు. ఈ రకమైన మంచి ధర్మ కార్యాన్ని ఆచరించటం అన్నింటికంటే ఉత్తమమైనదని సాధువులు చెబుతుంటారు. నా భర్తతో కలిసి ఉండటం అనేది నా ధర్మం. నేను ఎట్టి పరిస్థితుల్లోనూ నా ధర్మాన్ని వీడను" అని యముడితో అంది.

వరం కోరుకో

సావిత్రి చెప్పిన మాటలకు యముడు ప్రసన్ను డయ్యాడు. కానీ చనిపోయిన ఓ వ్యక్తి ప్రాణాలను తిరిగి ఇవ్వడం సంభవమా?

"సావిత్రి! నీ మాటలు నన్ను సంతోషపెట్టాయి. నీ భర్త ప్రాణాలు తప్ప ఏదైనా వరం కోరుకో – నేను తప్పకుండా ఇస్తాను" అని యముడు అన్నాడు.

"యమధర్మరాజా! నాకు మీ ఆశీస్సులు లభించటం ఆనందంగా వుంది. నేను నా కోసం ఏమీ కోరుకోను. దయ చేసి మా మావగారికి, చూపు ప్రసాదించండి" అని ప్రార్థించింది.

తన భర్త తల్లిదండ్రుల మీద సావిత్రికి వున్న ప్రేమను తెలుసుకొని యముడు ఎంతో ఆనందించాడు. "నీ కోరిక నెరవేరుతుంది. ఇప్పటికే నీవెంతో అలసిపోయావు. ఇక వెనుతిరుగు" అన్నాడు యముడు.

"ప్రభూ! నా భర్త చెంతన వుంటే నేనెలా అలసి పోతాను. అతను ఎక్కడ వుంటే నేనూ అక్కడే కదా వుండేది.

మంచి మనసున్న మనుషుల్ని ఒకసారి కలిసినా జీవితాంతం వారితో స్నేహం కొనసాగుతుంది. మంచి మనుషుల తోడు ఎప్పుడూ లాభమే. అందువల్లే ప్రతి మనిషి మంచి మనసున్న వ్యక్తులతో కలిసి వుండటానికి ప్రయత్నించాలి" అని సావిత్రి అంది.

ఆమె తెలివి తేటలకు యముడి మనసు ఆనందంతో నిండిపోయింది.

కానీ ఆయన సత్యవంతుడి ప్రాణాలనైతే తిరిగి ఇవ్వలేదు కదా!

"తల్లీ! నీ మాటలు నన్నెంతో సంతోషపెడుతున్నాయి. సరే...మరో వరం కోరుకో. అదీ నీ భర్త ప్రాణాలు తప్ప" అని యముడు అన్నాడు.

"ప్రభూ...మీ అనుగ్రహానికి ప్రసన్నురాలిని. మా అత్త మామలకు తమ రాజ్యం మళ్ళీ దక్కేలా - వారు ధర్మాధర్మ విచక్షణలోనూ, న్యాయబద్ధంగాను రాజ్యపాలన చేసేలా వరాన్ని ఇవ్వండి" అని సావిత్రి కోరింది.

"తథాస్తు! ఇక వెనకకు వెళ్ళి నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు" అని అన్నాడు యముడు.

"యమధర్మరాజా! అందరి పట్ల మీ ప్రవర్తన ఒకే విధంగా వుంటుంది. ఏమి చేసినా మీరు మీ కర్తవ్యాన్ని మాత్రం విస్మరించరు. అందువల్లనే మిమ్మల్ని ధర్మరాజు అని అంటారు. దయ చేసి నా మాటలను ఆలకించవలసిందిగా కోరుతున్నాను. ఎవరినీ ఎవ్వరూ మనసా వాచా కర్మణ మోసం చేయకూడదు. ప్రతి ఒక్కరు ఎదుటివారికి సాయం చేయాలనే భావించాలి. అదే ధర్మం...నియమం కూడా. దాని వల్లే ప్రపంచం సజావుగా సాగుతోంది. మంచి మనుషులు శత్రువుల పట్ల కూడా ఉదారంగా వుంటారు. ఇది నా నమ్మకం" అని అంది సావిత్రి.

"తల్లీ! నీ మాటలు అమృత గుళికలు. వాటిని వింటుంటే నా ఆనందం హద్దులు దాటుతోంది. సత్యవంతుడి ప్రాణాలు తప్ప ఏ వరమైనా కోరుకో" అని యముడు ప్రసన్న వదనంతో అన్నాడు.

"దేవా! నా తండ్రి రాజ్యవంశం నిరంతరం కొనసాగేలా ఆయనకో సుపుత్రుణ్ణి ప్రసాదించు. ఆయన రాజ్యం సుభిక్షంగా ఉండేలా చూడండి" అని కోరింది సావిత్రి.

"తథాస్తు! నీ తండ్రికి ఓ మంచి కుమారుడు కలుగుతాడు. నువ్వు నా వెనుక ఇప్పటికే చాలా దూరం వచ్చావు. ఇక వెనుదిరుగు" అన్నాడు యముడు.

"నేను నా భర్త చెంతన వుండగా - ఇది నాకు పెద్ద దూరం కాదు. దయచేసి నా మాటల్ని ఆలకించ ప్రార్థన. మీరెంతో శక్తిమంతులు. శాంతమూర్తులు, నిర్మల హృదయులు. సత్యాన్ని ఎప్పుడూ పాటిస్తూ ఉంటారు కాబట్టే ధర్మరాజు అనే పేరు పొందారు. ప్రతి వ్యక్తి ఎప్పుడూ మంచి కోసమే ఎదురుచూస్తుంటాడు. మంచి వ్యక్తులతో స్నేహంకోసం తపిస్తుంటాడు. ఆ స్నేహమే అతనికి నమ్మకాన్ని కలిగిస్తుంది. మీరు అటువంటి మంచి వ్యక్తి అని, నా నమ్మకం. మీరు నాకే విధమైన హానీ జరగకుండా చూడగలరని నాకు తెలుసు" అన్నది సావిత్రి.

యముడు కూడా ఓడిపోయాడు

"తల్లీ! ఇంత మంచి మాటలు నీ దగ్గర తప్పితే వేరెవరి నోటా వినలేదు. నీ భర్త ప్రాణాలు తప్ప వేరే వరం ఏదైనా కోరుకో. నేను తప్పక ఇస్తాను" అన్నాడు యముడు.

"దేవా! మీరు నా పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరి స్తున్నారు. నేనెంతో అదృష్టవంతురాలిని. మా రాజ్య ఖ్యాతిని పెంచే ఓ చక్కటి సుపుత్రుడిని నాకు ప్రసాదించండి" అని సావిత్రి కోరింది.

యముడు అనాలోచితంగా 'తథాస్తు' అని "తల్లీ! నువ్వు ఇప్పటికే బాగా అలసిపోయావు...ఇక వెనుదిరుగు" అన్నాడు.

"దేవా! నా మాట కాస్త వినండి. మంచి వ్యక్తులు ఎప్పుడూ ఉన్నత మార్గంలోనే నడుస్తారు. ఆ మార్గంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సత్యాన్ని మాత్రం వదిలి పెట్టరు. వాళ్లు అనుచితమైన కార్యాలు ఎప్పుడూ చేయరు. ఈ నేల అటు వంటి మంచి వ్యక్తులతోనూ, తపస్సంపన్నులతోనూ నిండి వుంది. వారు ఆశీస్సులు అందిస్తే....ఇక చెడు అనేది సమీపిం చదు" అని అంది.

"అమ్మా! నీ మాటలు ఆదర్శనీయం....అందులో ఎంతో లోతైన అర్థం వుంది. నీ మాటలు విన్న తర్వాత నా మనసులో నీ పట్ల అభిమానం మరింత పెరిగింది. ఏదైనా పెద్ద వరం కోరుకో! అని యముడు అన్నాడు.

"దేవా! నాదొక సందేహం? మీరు ప్రసాదిస్తున్న వరాలు సిద్ధిస్తాయా? అదే నిజమైతే నా భర్త లేకుండా నేను పుత్రుని ఎట్లు పొందగలను. అందుచే నా భర్త ప్రాణాలు తిరిగి ఇవ్వవలసిందిగా ప్రార్ధన. నా భర్త లేకపోతే నేను మృత ప్రాయురాలినే. నా భర్త లేకుండా నాకు స్వర్గము - సంపద ఏదీ అవసరం లేదు. మీ మాటలు నిజమయ్యేలా చూడాలని వుంది. ఆ వరాన్నే నాకు ప్రసాదించండి" అని అంది.

యమధర్మరాజు తర్కంలో సావిత్రితో ఓడిపోయారు.

"తల్లీ....నేను నీ భర్త ప్రాణాలు తిరిగి ఇచ్చేస్తున్నాను. అతను ఆరోగ్యవంతుడు, శక్తి సంపన్నుడు అవుతాడు. సన్మార్గంలో నడుస్తూ నాలుగు వందల సంవత్సరాల వరకూ జీవిస్తాడు. నువ్వు నీ భర్త పిల్లలతో ఎంతో సంతోషంగా వుంటారు. మీ తదనంతరం పిల్లలు సవిత్ర పేరుతో గుర్తింపబడతారు. నీ తండ్రికీ కొడుకు జన్మిస్తాడు. వాళ్ళు మీ అమ్మ తర్వాత మాళవ పేరుతో గుర్తింపు పొందుతారు. నువ్వు భక్తి శ్రద్ధలు, మంచితనం కారణంగా చనిపోయిన భర్తను తిరిగి పొందగలిగావు. నీకు సరి సమానమైన వాళ్ళు ఎవ్వరూ లేరు.

ఇక నువ్వు వెనక్కి వెళ్ళు తల్లీ" అని అన్నాడు యముడు. సావిత్రి మనసు పువ్వులా వికసించింది. ఆమె యముడి పాదాలకు నమస్కరించి "దేవా...మీ దయకు హద్దు లేదు. మీ ఆశీస్సులకు ధన్యవాదాలు" అని అంది.

యముడు తన లోకానికి తిరిగి వెళ్ళాడు.

నేనెలా నిద్రపోయాను!

సత్యవంతుడి శరీరం పడి వున్న చోటకు సావిత్రి వచ్చి కూర్చుని, అతని తలను తన ఒడిలో పెట్టుకుంది.

సత్యవంతుడి శరీరంలోకి ప్రాణం వచ్చి చేరింది. భర్త శరీరంలో కదలిక కనిపించగానే సావిత్రి మనసు సంతోషంతో నిండిపోయింది.

సత్యవంతుడు మేల్కొన్నాడు.

ఆశ్చర్యంతో లేచి కూర్చుంటూ "ఇదేమిటీ...ఇదెలా జరిగింది. నేను నిద్రపోయినప్పుడు పగటి వెలుతురు వుంది. మరిప్పుడు చీకట్లు ముసురుకున్నాయి. నేను ఇంతసేపు ఎలా నిద్రపోయాను? ఇదెలా జరిగింది?" అని అన్నాడు. ఆ తర్వాత సావిత్రి వైపు తిరిగి "చెలీ! నేను ఎంతసేపు నిద్రపోయాను?

గతంలో ఎప్పుడూ ఇంతసేపు నిద్రపోలేదు కదా! అన్నట్టు నేను పడుకునే ముందు ఓ నల్లటి ఆకారాన్ని చూశాను. అది నీకు కనిపించిందా?" అని అడిగాడు.

"నాథా! మీరు ఎక్కువ సేపు నిద్రపోయిన మాట నిజమే. మీరు చూసిన నల్లటి ఆకారం ఎవరిదో కాదు... యమధర్మరాజుది. ఈ విశ్వంలో ప్రాణమున్న జీవులన్నీ ఆయన ఆజ్ఞలను పాటించాల్సిందే. అయితే ఆయన వెనుతిరిగి వెళ్ళి పోయారు. ఇక మీరు విశ్రాంతి తీసుకోవచ్చు. లేదా నడవగల నంటే మనం ఆశ్రమానికి బయలుదేరుదాం" అని సావిత్రి బదులు చెప్పింది.

"కానీ...ఆ నల్లటి ఆకారం నన్ను తన వెంట తీసుకెళ్ళి నట్టుగా అనిపించింది. అది నిజమేనా....లేక కలా? సావిత్రి! నీకు తెలిసిన విషయాలు నాకు చెప్పు" అని సత్యవంతుడు అన్నాడు.

"నాథా! కళ్ళకి ఏమీ కనిపించనంతగా చీకటి పడింది. రేపు నేను మీకు జరిగినదంతా వివరంగా చెబుతాను. మన మిక్కడకు కట్టెల కోసం వచ్చాం. రాత్రి అవుతున్నా ఇల్లు

చేరలేదు. అక్కడ మీ అమ్మా నాన్న మన గురించి ఆలోచిస్తుం టారు. రాక్షసులు సంచరించే సమయమూ ఆసన్నమైంది. అడవి జంతువుల కదలికల కారణంగా ఆకులు చేస్తున్న చప్పుడూ మీకు వినిపిస్తూనే వుండి వుంటుంది. ఈ చీకటిని చూస్తుంటే నాకు భయం వేస్తోంది...ఇక ఇంటికి పోదాం పదండి" అని సావిత్రి బదులిచ్చింది.

"దారి కనిపించనంత చీకటిగా వుంది. ఇల్లు చేరే మార్గాన్ని ఎలా వెదకటం? ఇంత రాత్రి సమయంలో ఆశ్రమా నికి ఎలా చేరగలం?" అని సత్యవంతుడు సందేహాన్ని వెలిబు చ్చాడు.

తిరిగి ఆశ్రమానికి

అడవిలో ఓ చోట ఉన్నట్టుండీ అగ్గి పుట్టింది. దాంతో సావిత్రి కొన్ని కట్టెల్ని వెలిగించింది. సత్యవంతుడు తన తల్లిదండ్రుల గురించే ఆలోచిస్తూ వున్నాడు.

"సావిత్రీ! నేను ఎప్పుడూ ఇంత సమయం బయట గడపలేదు. పగటి సమయంలో అయినా నేను ఆశ్రమం బయట వుంటే అమ్మానాన్న నా గురించే ఆలోచిస్తూ వుండే

వారు. నన్ను వెదుకుతూ బయలుదేరేవాళ్ళు. ఓ రోజున కళ్ళల్లో నీరు నింపుకుని 'నాయనా! నువ్వు లేకుండా మేం ఒక్క క్షణం కూడా వుండలేం. ఈ ముసలి తల్లిదండ్రుల కంటి వెలుగు నీవే' అని అన్నారు. మరి ఇప్పుడు వారెలాంటి స్థితిలో వున్నారో నాకు తెలియటం లేదు. వారికేమైనా అయితే నేను జీవించలేను. ఇదంతా నేను గాఢనిద్ర పోవటం వల్లే జరిగింది" అని సత్యవంతుడు బాధపడ్డాడు.

సావిత్రి తన మధురమైన మాటలతో సత్యవంతుడి బాధను దూరం చేసే ప్రయత్నం చేసింది. తన ఇష్టదైవాన్ని స్మరించుకోవటం మొదలుపెట్టింది. తన మనస్సులోనే నమస్కరించుకొని "నేను ధర్మాన్ని విశ్వసించేది నిజమైతే - నేను ఇంతవరకూ అసత్యం పలకని మాట వాస్తవమైతే నా భర్త తల్లిదండ్రులకు ఏ హానీ జరగకూడదు. వారు సురక్షితులుగా వుండాలి. నా పుణ్యఫలం కారణంగా వారు ఆయురారోగ్యాలతో సుఖంగా వుండాలి" అని ప్రార్థించింది.

"అమ్మా నాన్నలకు ఏ హానీ జరగకముందే మనం అక్కడకు చేరుదాం. నా మీద నమ్మకం పెట్టుకొని బయలు

దేరు. ఏదో ఒక దారి గుండా ఆశ్రమానికి చేరదాం" అని సత్యవంతుడు అన్నాడు.

సావిత్రి వెంటనే లేచి నుంచుంది. తన చేయి అందించి భర్త నిలబడటానికి సాయం చేసింది. కట్టెలు కొట్ట డానికి తీసుకొచ్చిన గొడ్డలిని అందుకుని సత్యవంతుడు భుజాన పెట్టుకున్నాడు. దారిలో దాని అవసరం వుంటుం దేమోనని. వారిద్దరూ ఆశ్రమం దిశగా బైలుదేరారు.

మార్గం మధ్యలో సత్యవంతుడు "సావిత్రి! ఇది మనకు తెలిసిన దారే...నడవటం కష్టమేమీ కాదు. వచ్చేప్పుడు కూడా ఇటు నుండే ప్రయాణం చేశాం. ఇక్కడే పళ్ళను సేకరిం చాం...అదిగో అక్కడ పూలను కోశాం. ఈ పక్కన ముళ్ళుం టాయి జాగ్రత్త...ఇటు ఉత్తర దిశగా వున్న దారి మన ఆశ్రమా నికే వెళ్తుంది" అంటూ సావిత్రి చేయి పట్టుకుని ముందుకు సాగాడు.

అలా మాట్లాడుతూ తన తల్లిదండ్రుల గురించి ఆలోచిస్తూ సత్యవంతుడు వేగంగా నడవసాగాడు. సావిత్రి కూడా భర్తతో సమానంగా నడుస్తూ వుంది.

అది పవిత్ర రాత్రి

ఇది ఇలా వుండగా...అక్కడ ఆశ్రమంలో ద్యుమత్సేనుడు తన కొడుకు ఇంకా ఇంటికి రాలేదని ఆలోచిస్తూ వున్నాడు. ఇటువంటి సమయంలో ఆయనకు హఠాత్తుగా కంటి చూపు వచ్చింది. అంధకారంతో నిండిపోయిన ఆయన జీవితంలో మళ్ళీ వెలుగు వచ్చింది. ఆయన ఆనందానికి హద్దులు లేవు. ఆ సంతోషకర పరిస్థితుల్లోను కొడుకు ఇంకా ఇంటికి రాలేదన్న ఆలోచనే ఆయనను కృంగదీస్తూ వుంది. సమయం గడుస్తున్న కొద్దీ మనసులో భయం పెరగసాగింది. కొడుకు - కోడలు ఇంకా రాలేదేమిటా అని ఒకరిని ఒకరు ప్రశ్నించుకోసాగారు. వారు చుట్టు పక్కల వున్న ఆశ్రమాన్ని చూసి వచ్చారు. ఎక్కడ కొద్దిగా చప్పుడు అయినా - కొడుకూ, కోడలు తిరిగి వచ్చారేమోనని చూడసాగారు. దగ్గరలో వున్న చెరువులను, కాలువలను వెదికారు. అలా బయటకు వెళ్ళి రావటంవల్ల కాళ్ళలో రాళ్ళు, ముళ్ళు గుచ్చుకొని రక్తం కూడా వచ్చింది.

ఆశ్రమంలోని పెద్దలు పిన్నలు వీరిద్దరినీ శాంతింప చేయడానికి తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నించసాగారు.

సరిగ్గా అదే సమయంలో సావిత్రి సత్యవంతుడితో కలిసి ఆశ్రమంలోకి అడుగు పెట్టింది. ఈ నవ దంపతుల్ని చూడగానే అక్కడివారి మనసంతా సంతోషంతో నిండిపోయింది. అందరి పెదవుల మీద 'ఇంత ఆలస్యం ఎందుకయ్యింది' అన్న ప్రశ్నే వుంది.

దానికి సత్యవంతుడు సమాధానం చెబుతూ "నేను అడవిలో కట్టెలు కొడుతూ వుండగా తలలో భరించలేనంత నొప్పి వచ్చింది. దాంతో కాసేపు విశ్రమించాను. ఆ తర్వాత నిద్రలోంచి లేచి చూసేసరికీ బాగా చీకటి పడింది. మీరందరూ మా గురించే ఎదురు చూస్తూ వుంటారనే ఆలోచనతో రాత్రి అయినా అడవి నుండి బయలుదేరి వచ్చేశాం" అని అన్నాడు.

వారిలో గౌతముడు అనే వయోవృద్ధుడు ముందుకు వచ్చి "నాయనా సత్యవంతా! మీ నాన్నగారికి కంటి చూపు తిరిగి వచ్చింది. అయినా నువ్వు ఆలస్యంగా రావడానికి వేరే కారణం ఏదో వుండి వుంటుంది. సావిత్రికి అది తెలిసి వుండొచ్చు. అమ్మా! సావిత్రి... అది అందరికీ తెలియచేయదగ్గ

దయితే నువ్వు చెప్పు...నీ ముఖంలో ఎంతో ఆనందం కనిపిస్తోంది....కారణం ఏమిటి?" అని అన్నాడు.

"మహర్షీ! మీరు అన్నది నిజమే. ఇందులో దాయవలసింది ఏమీ లేదు. అక్కడ ఏం జరిగిందో మీకు వివరిస్తాను" అని సావిత్రి చెప్పసాగింది.

"నారద మహర్షి ఓ సంవత్సరం క్రితమే ఈ రోజు సత్యవంతుడికి ఆఖరి రోజు అని చెప్పారు. కానీ అప్పటికే నేను సత్యవంతుడికి నా మనసులో స్థానం కల్పించాను. అందువల్లే ఏ రకమైన సంకోచం లేకుండా ఆయన్ని వివాహం చేసుకున్నాను. ఆ కారణంగానే ఈ రోజు నేను సత్యవంతుడితో కలిసి అడవికి వెళ్ళాను. కట్టెలు కొడుతూ ఆయన భరించలేని తలనొప్పితో పడిపోయారు. అదే సమయంలో యమధర్మరాజు ప్రత్యక్షమయ్యి ఆయన ప్రాణాల్ని హరించాడు. యముడి వెనకే నేను వెళ్ళాను. నా సత్యవచనాలు విని యముడు ప్రసన్నుడయ్యాడు. దాంతో ఆయన నాకు ఐదు వరాల్ని ఇచ్చాడు. నా మామగారికి కంటి చూపు ప్రసాదించమని, రాజ్యాన్ని తిరిగి ఇవ్వమని రెండు వరాల్ని కోరాను.

నా తండ్రికి పుత్రుడ్ని ప్రసాదించమని, అలానే నాకూ ఓ కొడుకుని ఇవ్వమని మరో రెండు వరాలు కోరాను. ఐదోవరం నేను, సత్యవంతుడు నాలుగువందల సంవత్సరాలు జీవించేది.

నేను మూడు రోజులుగా పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాను. నా భర్త మృత్యువును జయించాలనే నేను ఈ ఉపవాస దీక్ష చేపట్టాను. ఇక ఇవాల్టితో నా బాధలన్నీ పరిసమాప్తమయ్యాయి. నా మనసులో ఆనంద తరంగాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆ సావిత్రిదేవీ, పెద్దలైన మీ ఆశీర్వాద కారణంగా నా భయం సమసిపోయింది" అని సావిత్రి వివరించింది.

సావిత్రి మాటలు విన్నాక అత్తమామల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. వారు నిండు మనసుతో సావిత్రిని ఆశీర్వదించారు. ఆమె పట్ల అభిమానంతో వారి మనసు నిండిపోయింది.

అత్త మామల కుటుంబాన్ని ఆదుకున్న వ్యక్తిగా, ఓ పవిత్రమైన, మహోన్నతమైన స్త్రీగా, భర్త కోసం సర్వస్వాన్నీ సమర్పించగల భార్యగా ఆమెను వారు గౌరవించారు.



నిండు మనసుతో అందరూ సావిత్రిని ఆశీర్వదించారు.

దుఃఖపూరితమైన ఆ రేయి ఓ ఆనందోత్సవాల రాత్రిగా మారిపోయింది. నిదానంగా రాత్రి గడిచి తెల్లవారింది. అక్కడి వాళ్ళందరూ రాత్రి జరిగిన ఆనందకర సంఘటననే తలుచు కుంటూ చర్చించుకోసాగారు.

అప్పుడే వారికి కొద్ది దూరంలో ఓ గుంపు కనిపించింది. గుర్రం మీద కూర్చున్న ఓ వ్యక్తి ఆ గుంపుకు నాయకుడిలా వున్నాడు.

వారంతా ఎంతో ఉత్సుకతతో చూడసాగారు. ఆ అశ్వారోహకుడు వారి దగ్గరకు రాగానే - గుర్రం మీద నుండి కిందకు దిగి ధ్యుమత్సేనుడికి సాదరంగా నమస్కరించాడు. ఆయన ధ్యుమత్సేనుడి మంత్రి.

"స్వామీ! నేను మీకో శుభవార్త తీసుకొచ్చాను. శత్రువులు యుద్ధంలో నా చేతిలో ఓడిపోయారు. ప్రజలంతా మీరే రాజు కావాలని భావిస్తున్నారు. దయచేసి మా అందరి కోరిక నెరవేర్చవలసిందిగా నా ప్రార్థన" అని అన్నాడు మంత్రి.

"నా ప్రజల కోరికే నా కోరిక. నా ప్రజలకు సేవ చేయడమే నాకు ఆనందం. భగవంతుడి దయవల్ల, సావిత్రి దైవభక్తి కారణంగా నాకు మళ్ళీ కంటి చూపు వచ్చింది. మన

రాజధానికి ప్రయాణమవ్వడానికి సిద్ధంకండి...మనం వెంటనే అక్కడకు వెళ్ళాలి" అని ధ్యుమత్సేనుడు అన్నాడు.

ఆయనను రాజధానికి ఓ సంపూర్ణ రాజులా గౌర వంతో తోడ్కొని వెళ్ళారు. ధ్యుమత్సేనుడు మహారాజు, సత్యవం తుడు యువరాజు అయ్యారు.

సావిత్రి తనను, తన భర్తను, తన తల్లిదండ్రుల్ని, అత్తమామలను కూడా ఓ పెద్ద విపత్తు నుండి కాపాడుకుంది.

సంపూర్ణ సమర్పణా భావం, భర్త పట్ల అమిత ప్రేమ, రాతి వంటి దృఢనిర్ణయం, ఉక్కు వంటి బలమైన కోరిక... ఇటువంటి గొప్ప గుణాలు సావిత్రిలో వున్నాయి.

సావిత్రి కథ మృత్యువు మీద గెలిచిన ప్రేమకథ. స్త్రీలో దాగి వున్న శక్తిని తెలియచేసేది ఆమె జీవితం. ఆడది అబల అని కొందరు అన్నా సావిత్రి కథ భారతదేశ గౌరవ, మర్యా దలను ఇనుమడింపచేసింది.

